క్లుప్తంగా

అన్నదాన ట్రస్టుకు దాతల విరాళం



దాత కుటుంబానికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఉద్యోగులు

మామిడికుదురు: అప్పనపల్లి **శ్రీబాల బాలాజీ** స్వామివారి ఆలయంలో **నిత్యాన్నదాన** ట్రస్టుకు గురువారం పలువురు **విరాళాలు సమ** ర్పించారు. రామచంద్రపురా**నికి చెందిన గౌతు** లక్ష్మీ మంగతాయారు స్మారకా**ర్థం వారి కుటుం** బ సభ్యులు గౌతు **వెంకటేశ్వరరావు** రూ.10,117, విజయవాడ **గంపలగూడేనికి** చెందిన కుప్పాల శ్రీకాంత్, **రాజేశ్వరి దంప** తుల పెళ్లి రోజు సందర్భంగా వారి కుటుంబ సభ్యులు బొమ్మకాని కోటేశ్వరరావు, అరుణ కుమారి దంపతులు రూ.10 వేలు అందించారు. ఈ విరాళాలను ఆలయ ఉద్యోగులకు అందజేశారని ఈఓ గ్రంధి మాధవి తెలిపారు. దాతలకు ఆలయ ఉద్యోగులు, అర్చకులు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను ఇచ్చారు.

విద్యుత్ ఇబ్బందులు రానీయొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీవెంకట నాగదేవి

రావులపాలెం: ప్రస్తుత వేసవిలో ప్రజలకు తాగునీరు, విద్యుత్ ఇబ్బందులు లేకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కర్రి లక్ష్మీవెంకట నాగదేవి అన్నారు. స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. జిల్లా ఎన్నికల అధికారి అనుమతితో ఎన్నికల నియమావళి లోబడి సమావేశాన్ని నిర్వహించారు. తాగునీరు, విద్యుత్, విద్య, వ్యవసాయం, శానిటేషన్ తదితర అత్యవసర పనులపై సమీక్షించారు. జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ గన్నవరపు వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ఎంపీడీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.


శుభ్రతపై అవగాహన

ఆత్రేయపురం: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో దుకాణదారులకు ఆహార ఉత్పత్తి, శుభ్రతపై జిల్లా ఎఫ్ఎస్ఓ ప్రసాద్ అవగాహన కలిగించారు. వ్యాపారులు పాటించాల్సిన జాగ్రత్తలు, ఆహార నాణ్యతా ప్రమాణాలు ఎలా పెంచాలనే విషయమై శిక్షణ ఇచ్చారు. టీటీటీ ఇండియన్ ఫుడ్ సొల్యూషన్స్ డైరెక్టర్ బ్రిజేష్ పటేల్, మేకా సూర్యనారాయణ, గద్దె గోపాలకృష్ణ, శ్యామ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐరన్ సిరప్ అందజేత

ఆలమూరు: మండలంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాలు, ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం ఐరన్ సిరప్స్ అందజేశారు. కేంద్రం ప్రవేశపెట్టిన ఎనిమియా ముక్త్ భారత్‌లో భాగంగా చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, పి.భవానీశంకర్ ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలకు ఆరు నెలల నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు ఈ డ్రాప్స్ వేశారు. ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

బాధితురాలి వైద్యానికి సాయం



బాధితురాలికి సాయం చేస్తున్న సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: పేదరికంతో వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉన్న మహిళకు స్థానిక అక్షయ సేవా సంస్థ సభ్యులు గురువారం రూ.10,500 అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా పెరవలి మండలం పిట్ల వేమవరం గ్రామానికి చెందిన గుత్తాల నాగమణి హెర్నియాతో బాధపడుతున్నారు. అక్కడకు వెళ్లి ఆమెకు సాయం అందించారు.

ప్రసూతి సేవలు విస్తృతం

ఆలమూరు: స్థానిక సీహెచ్‌సీలో నిపుణులచే ప్రసూతి సేవలను అందిస్తున్నామని ప్రధాన వైద్యాధికారి పి.గోపీరామ్ వెల్లడించారు. సీహెచ్‌సీలో మరో వైద్యాధికారి డి.శిరీషతో కలసి ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలతో ఈ సీహెచ్‌సీలో 2023–24 సంవత్సరానికి సంబంధించి 276 మందికి ప్రసూతి సేవలను అందించామన్నారు. ఇందులో 192 మందికి సాధారణ ప్రసవాలు కాగా, 174 మందికి శస్త్రచికిత్సలు చేశామన్నారు. ఈ ఏడాది ప్రతి నెలా సరాసరి 25 వరకూ ప్రసవాలు జరుగుతున్నాయన్నారు. ఆస్పత్రిలో ఎనిమిది మంది వైద్యాధికారులకు గాను ఏడుగురు ఉన్నారన్నారు. తమ ఆసుపత్రికి వచ్చే రోగుల ఆరోగ్య పరిస్థితులను బట్టి మాత్రమే పెద్దాసుపత్రులకు సిఫారసు చేస్తున్నామన్నారు. ఈ సేవలను ప్రజలు అన్నివేళలా ఉపయోగించుకోవచ్చని గోపీరామ్, శిరీష తెలిపారు.

వెనుకబడిన వర్గాలకు చేయూత



వెనుకబడిన పిల్లలకు చేయూత అందించమే మా సంఘం ప్రధాన లక్ష్యం. ఈ దిశగానే సంఘం ఏర్పాటు చేసి ముందుకు వెళ్తున్నాం. ఈ కార్యకలాపాలను ప్రతి ఏడాది విస్తరిస్తున్నాం. విద్యార్థులను ప్రోత్సహించడంతో పాటు సామాజిక సమస్యలపై కూడా పోరాటం చేస్తున్నాం. వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరిస్తున్నాం. ఈ సంఘం పురోభివృద్ధి చెందడానికి ఎంతో మంది అండగా నిలుస్తున్నారు.

–కారుపల్లి కళ్యాణ్‌బాబు, సంఘ ప్రధాన కార్యదర్శి, అప్పనపల్లి

పోటీతత్వంతో చదువుకునేలా..



ప్రతిభావంతులైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను ప్రోత్సహించడం ముదావహం. షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం అందిస్తున్న సేవలు నేటి యువతకు ఎంతో స్ఫూర్తిగా నిలుస్తున్నాయి. ఎంతో మంది పేద విద్యార్థులు పోటీతత్వంతో చదువుకుని ముందుకు వెళ్తున్నారు. వీటితో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా సంఘం భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉంది. సంఘం సేవలు మరింత విస్తరించాలని ఆశిస్తున్నాం.

–దాసరి స్నేహశ్రీ, ఈదరాడ, విద్యార్థిని

ప్రతిభావంతులను ప్రోత్సహించడానికే..



ఎస్సీ, ఎస్టీ కులాల్లో ఎంతో మంది ప్రతిభావంతులు ఉన్నారు. వారికి సరైన ప్రోత్సాహం లేక వెనుకబడిపోతున్నారు. అటువంటి వారికి అండగా నిలవాలన్నదే మా సంఘం లక్ష్యం. ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన విద్యార్థులతో పాటు ఇతర కులాలకు చెందిన వారికి మా వంతు సహాయం అందించేందుకు కృషి చేస్తున్నాం. సంఘంలో సభ్యులుగా ఉన్న ఉద్యోగులతో పాటు దాతలు ఇచ్చే మొత్తంతో ఈ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

–భూపతి మనోహరరాజు, సంఘ అధ్యక్షుడు, మాకనపాలెం

ఇతోధిక సేవ.. స్ఫూర్తికి తోవ

- ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం ఉదారత
- 110 మంది ఉద్యోగులతో వివిధ కార్యక్రమాలు
- ఇప్పటి వరకూ రూ.16 లక్షలతో సహాయం



మామిడికుదురు హాస్టల్ విద్యార్థులకు పరుపులు పంపిణీ చేస్తున్న సంఘ సభ్యులు



నగదు ప్రోత్సాహకాలు అందుకున్న ప్రతిభావంతులైన విద్యార్థులు

మామిడికుదురు: అందరూ బాగుండాలి, అందులో మనమూ ఉండాలనే నినాదం వారిది.. సమాజ హితం కోరుతూ ఆ ఉద్యోగులు చేస్తున్న సేవ అందరి ప్రశంసలు అందుకుంటోంది.. ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘ మామిడికుదురు మండల శాఖ 1992లో ఏర్పాటైంది.. దీనిద్వారా ఏటా ఉద్యోగులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో ప్రభుత్వ ఎస్సీ ఉద్యోగులు 110 మంది సభ్యులుగా ఉన్నారు. ఈ సంఘం ద్వారా ఇంత వరకూ రూ.16 లక్షలతో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ప్రతి ఏడాది ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ప్రతిభావంతులైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు 1 నుంచి 10వ తరగతి, ఇంటర్‌లో టాపర్స్‌కు రూ.3 వేలు, ఇతరులకు రూ.2 వేల చొప్పున ఏడాదికి 50 మంది విద్యార్థులకు అందిస్తున్నారు.

శిక్షణ ఇస్తూ.. ప్రోత్సహిస్తూ..

మండలంలోని ప్రభుత్వ బాలుర, బాలికల వసతి గృహాల్లోని విద్యార్థులకు రూ.2.10 లక్షలతో పరుపులు కొనుగోలు చేసి ఇచ్చారు. ప్రతి ఏడాది పదో తరగతి చదివే హాస్టల్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్నారు. కుల, మతాలకు అతీతంగా 62 మంది మహిళలకు నెల రోజుల పాటు ఉచితంగా కుట్టు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. పలువురు అగ్ని ప్రమాద బాధితులకు నిత్యావసరాలు, నగదు అందించి ఉదారత చాటుకున్నారు. వీటితో పాటు పలు సామాజిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించారు. వీటితో పాటు అంబేడ్కర్ జయంతికి మండల స్థాయిలో పోటీ పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు పురస్కారాలు అందిస్తున్నారు. ప్రస్తుతం భీమ్ విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేసి, దానిద్వారా 3 నుంచి పదో తరగతి విద్యార్థులు పలు సబ్జెక్టుల్లో బేసిక్స్ నేర్చుకునేందుకు ఉచిత అవగాహన తరగతులు నిర్వహిస్తున్నారు. యోగా, క్విజ్ వంటి ఇతర అంశాలపై కూడా శిక్షణ ఇస్తున్నారు.

ఇతరులకు ఆదర్శం



షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం ద్వారా నగదు ప్రోత్సాహం అందించారు. విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగేందుకు ఈ నగదు ప్రోత్సాహకాలు ఉపయోగపడుతున్నాయి. నిరుపేద కుటుంబాలకు సంక్షేమ సంఘం అండగా నిలుస్తోంది. ఉద్యోగులు ఎంతో ఉదారతతో అందిస్తున్న సహాయం ఇతరులకు అదర్శంగా నిలుస్తోంది.

–నీతిపూడి అనూష, డిగ్రీ విద్యార్థిని, అప్పనపల్లి

పుస్తక పఠనంతో ఆలోచనా శక్తి

అంబాజీపేట: పుస్తక పఠనంతో ఆలోచనా శక్తి పెరుగుతుందని గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ అన్నారు. అంబాజీపేట శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు యోగా, జీకే, గణితం తదితర అంశాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానాటికీ పెరిగిపోతున్న కాలుష్యాన్ని అధిగమించాలంటే పచ్చదనం పెంచాలన్నారు.

గుర్రపుడెక్క తొలగించండి

మలికిపురం: శివకోడు లాకుల నుంచి సఖినేటిపల్లి లాకుల వరకూ గన్నవరం ప్రధాన కాలువ మూలపోడు, మలికిపురం ఎత్తు నుంచి వినాయకపురం వరకూ కాలువలో గుర్రపుడెక్క తొలగించాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివకుమార్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ కొద్ది రోజుల్లో నీటి విడుదల కానున్న నేపథ్యంలో శివారు వరకూ నీరు అందే పరిస్థితులు లేవన్నారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి గుర్రపుడెక్క తొలగింపునకు చర్యలు తీసుకోవాలన్నారు.

మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి



తాడి సహదేవ్

సఖినేటిపల్లి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని, ఇది కొద్ది రోజుల్లోనే ఎన్నికల కౌంటింగ్ రోజున తేలనుందని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు తాడి సహదేవ్ అన్నారు. గురువారం వీవీ మెరకలో ఆయన మాట్లాడుతూ పోలింగ్ రోజున భారీ క్యూలో ప్రత్యేకించి మహిళలు నిలబడి ఫ్యాన్ గుర్తుకే ఓటేశారన్నారు. విశాఖపట్నం వేదికగా సీఎంగా జగనన్న చేయబోయే ప్రమాణ స్వీకారం కోసం ప్రజలు ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నారన్నారు.

అట్టహాసంగా అమ్మవార్ల తీర్థం



పాశర్లపూడిలో దేవతలు నూకాలమ్మ, మహలక్ష్మమ్మ



జి.అగ్రహారంలో షిరిడీ సాయిబాబు

మామిడికుదురు: పాశర్లపూడి గ్రామ దేవతలు నూకాలమ్మ, మహలక్ష్మమ్మ అమ్మవార్ల తీర్థ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. సోమవారం నుంచి గురువారం వరకూ జాతరను ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాల అలంకరణలు, పూలతో అమ్మవార్ల ఆలయాలను దేదీప్యమానంగా తీర్చిదిద్దారు. తీర్థం సందర్భంగా ఆలయాల వద్ద భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

బాబా మందిర వార్షికోత్సవం

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారంలో సాయిబాబు మందిర వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు సుదర్శనం కేశవచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్న సమారాధన జరిగింది.

హనుమజ్జయంతికి ఏర్పాట్లు

సఖినేటిపల్లి: వచ్చే నెల 1న హనుమజ్జయంతిని పురస్కరించుకుని మండలంలోని రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల వద్ద ఆయా కమిటీలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాయి. ఐదు రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాలకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు. మోరి, అంతర్వేదికర, టేకిశెట్టిపాలెం ఏటిగట్టు, అంతర్వేది రోడ్డు సెంటర్, కేశవదాసుపాలెంలలో ఆలయాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. మోరి శ్రీరామభక్తాంజనేయ స్వామివారి ఆలయం వద్ద అర్చకుడు సుదర్శనం రంగాచార్యులు ఆధ్వర్యంలో, మోరి శేషన్న రాయుడు కాల్వగట్టు ప్రసన్నాంజనేయ స్వామివారి ఆలయం వద్ద అర్చకుడు ఎస్‌బీవీఎన్ సాయి దుర్గానగేష్ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, నిత్య సింధూర పూజలు నిర్వహించనున్నారు. స్వామివారి భక్త బృందం సభ్యులచే ఏకాహం ఆలయాల వద్ద ఏర్పాటు చేస్తున్నారు.

మహాయజ్ఞాన్ని విజయవంతం చేయండి



మామిడికుదురు సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం

మామిడికుదురు: అమలాపురం మెట్ల సత్యనారాయణ కాపు కల్యాణ మంటపంలో జూన్ 2న జరిగే సహస్రగళ హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం కోరారు. గురువారం మామిడికుదురులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హనుమజ్జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. వెయ్యి మంది భక్తులచే సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ జరుగుతుందన్నారు. ఈ మహాయజ్ఞంలో భక్తులు భాగస్వాములు కావాలని కోరారు. సమావేశం అనంతరం భక్తులకు కరపత్రాలు పంచారు. జిల్లా కార్యదర్శి ప్రయాగ నర్సింహమూర్తి, టీటీడీ ప్రతినిధులు గొవ్వాల నాగరాజు, కంచర్ల గణపతిరావు, బొక్కా సూర్యప్రకాశరావు, అనిశెట్టి పండు, రుద్రా శ్రీను, పాయసం సత్తిబాబు పాల్గొన్నారు.

విద్యా కానుకలొచ్చేశాయ్..



అంబాజీపేట స్టాక్ పాయింట్‌లో భద్రపరిచిన పాఠ్య, నోట్ పుస్తకాలు

- నియోజకవర్గంలో స్టాక్ పాయింట్లకు చేరిక

అంబాజీపేట: అందరికీ విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పైసా ఖర్చు లేకుండా నాణ్యమైన అందించేందుకు జగనన్న విద్యా కానుక (జేవీకే) కిట్లు అందిస్తోంది. అవి ఇప్పటికే పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల్లోని ఆయా స్టాక్ పాయింట్‌లు అయిన జెడ్పీ హైస్కూళ్లకు చేరుకున్నాయి. ప్రభుత్వం పంపిన స్టాక్‌ను పాఠశాలలకు సరఫరా చేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం నాలుగేళ్లగా నిరాటంకంగా విద్యార్థులకు అందించిన జీవీకే కిట్లు వరుసగా ఐదో ఏడాది పాఠశాలలు తెరిచిన రోజునే విద్యార్థులకు అందనున్నాయి. మూడు నియోజకవర్గాల పరిధి 11 మండలాల్లో 757 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 54,901 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి 2024–25 విద్యా సంవత్సరంలో విద్యా కానుక అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు వచ్చాయి. పి.గన్నవరం నియోజకవర్గంలో 290 పాఠశాలల్లో 20 వేలు, కొత్తపేట నియోజకవర్గంలో 238 పాఠశాలల్లో 19,800, రాజోలు నియోజకవర్గంలో 229 పాఠశాలల్లో 15,101 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠ్య పుస్తకాలను ప్రారంభం రోజునే విద్యార్థులకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా విద్యాశాఖాధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందుకు అనుగుణంగా ఈ కార్యక్రమం అమలుకు ప్రత్యేక అధికారులను సైతం నియమించారు.

పాఠశాలలు తెరిచే నాటికి ఇస్తాం..

జూన్ 12న పాఠశాలలు పునః ప్రారంభం నాటికి విద్యా కానుక కిట్లు పూర్తి స్థాయిలో సిద్ధం చేస్తున్నాం. నోటు పుస్తకాలతో పాటు 8, 10 తరగతుల పాఠ్య పుస్తకాలు సైతం పూర్తి స్థాయిలో వచ్చాయి. వచ్చిన స్టాక్ వచ్చినట్లుగా భద్రపరుస్తున్నాం.

– కె.వెంకటేశ్వరరావు, ఎంఈఓ–1, అంబాజీపేట

చుర్రుమనిపించిన సూరీడు

- 40 డిగ్రీలు దాటుతున్న ఉష్ణోగ్రతలు
- ఎండలతో జనం ఉక్కిరిబిక్కిరి



కె.పెదపూడిలో నిర్మానుష్యంగా రహదారి

అంబాజీపేట: సూరీడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఎక్కడా వెనక్కి తగ్గడం లేదు.. రోహిణీ కార్తె ప్రభావంతో మరింత ఠారెత్తిస్తున్నాడు. ప్రస్తుతం 40 నుంచి 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. గురువారం 41.5 ఉష్ణోగ్రత నమోదైంది. తీవ్ర ఉక్కబోత, వేడిగాలులతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఉదయం నుంచే భానుడు తన ఉగ్రరూపం దాల్చడంతో మంట మీద కూర్చున్నట్లు ఉందని ప్రజలు వాపోతున్నారు. ఎండ వేడికి ప్రజలు బయటకు రావడానికే హడలిపోయారు. మూడు రోజుల నుంచి రోహిణీ ప్రభావం కనబడుతుండడంతో భయపడుతున్నారు. ఎండలకు వృద్ధులు, చిన్నారులు మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత పెరుగుతూ వచ్చింది. దీంతో ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. బస్సులు, లారీల డ్రైవర్లు నానా ఇబ్బందులు పడ్డారు. ముఖానికి వస్త్రాలు కట్టుకొని ఎండ తగలకుండా ప్రయత్నాలు చేసుకుంటున్నారు. మధ్యాహ్నం 12 గంటలయ్యే సరికి పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల్లోని ప్రధాన రహదారులు ఖాళీగా కనిపిస్తున్నాయి. అన్ని సెంటర్లలో దుకాణాలన్నీ మూతబడుతున్నాయి. రాబోయే రెండు, మూడు రోజుల్లో పగటి ఉష్ణోగ్రతలు మరింత పెరిగి 42 డిగ్రీలకు పైబడి నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ సైతం హెచ్చరిస్తోంది. నివాసాలు, కార్యాలయాలు, వ్యాపార సముదాయాల్లో నిత్యం ఏసీలు, కూలర్లు, పనిచేస్తూనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉద్యోగాలు, వ్యాపారులు, వ్యక్తిగత పనులపై ప్రయాణాలు చేసేవారు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రావులపాలెం: ఈతకోట సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ గురువారం తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. గోపాలపురం, ఈతకోట, ముమ్మిడివరప్పాడు, లక్ష్మీపోలవరం, పొడగట్లపల్లి, మట్లదొడ్డి, దేవరపల్లి, వేదిరేశ్వరం, కోసూరునగర్, గరువు, కేతరాజుపల్లి, చెల్లిరేవు ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. అలాగే రావులపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి సరఫరా అయ్యే విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంట వరకూ సరఫరా నిలిపివేస్తామన్నారు. రావులపాలెం, ఊబలంక సబ్ స్టేషన్ల పరిధిలో ఊబలంక, రావులపాలెం, డిగ్రీ కాలేజీ ఏరియా, అంకాలమ్మ గుడి ఏరియా, సీఆర్‌సీ రోడ్డు, కొమరాజులంక, రావులపాడు గ్రామాలకు ఆటంకం కలుగుతుందన్నారు.

మామిడికుదురు: మండలంలోని 18 గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

అయినవిల్లి: మండలంలో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవికుమార్ తెలిపారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

అంబాజీపేట: ఇంటి తాళాలు పగులకొట్టి విలువైన ఆభరణాలు అపహరించుకుపోయిన ఓ వ్యక్తిని అంబాజీపేట పోలీసులు అరెస్ట్ చేశారు. పుల్లేటికుర్రులో గుమ్మడి గంగాధర్ (చందు) గత ఏడాది నవంబర్ 15న అదే గ్రామానికి చెందిన అయ్యగారి శివశంకర్ ఇంటి తాళాలు పగులకొట్టి విలువైన బంగారం, వెండి వస్తువులు దొంగిలించాడు. 29న గంగాధర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్టు ఎస్సై కె.చిరంజీవి తెలిపారు.

ఒకరికి గాయాలు

అయినవిల్లి: ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలైనట్లు అయినవిల్లి పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ వి.శ్రీనివాసరావు తెలిపారు. మడుపల్లికి చెందిన గుమ్మడి ఏసు పచ్చిమిర్చి లోడుతో బైక్‌పై ముక్తేశ్వరం నుంచి అమలాపురం వైపు వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న మరో బైక్ సిరిపల్లి కొండలమ్మ చింత వద్ద అతివేగంగా వచ్చి ఢీకొంది. దీంతో ఏసును అమలాపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

రుచిగా.. శుచిగా మధ్యాహ్న భోజనం



కొత్తపేట సమావేశంలో మాట్లాడుతున్న డీపీడీ సురేష్‌కుమార్

కొత్తపేట: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం రుచిగా.. శుచిగా ఉండాలని మధ్యాహ్న భోజన పథకం జిల్లా అడిషనల్ డైరెక్టర్ డి.సురేష్‌కుమార్ సూచించారు. విద్యాశాఖ ఆదేశాల ప్రకారం మండలంలోని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు, కుక్ కమ్ హెల్పర్లకు స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సురేష్‌కుమార్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విద్యాభివృద్ధి పథకాల్లో మధ్యాహ్న భోజన పథకం అత్యంత ప్రాధాన్యం కలిగి ఉందన్నారు. దీనిని సక్రమంగా అమలు చేయాలని సూచించారు. మెనూ పక్కాగా అమలు చేయాలన్నారు. ఎంఈఓ హరిప్రసాద్, ఎంఈఓ– 2 లీలావతి మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి తినేలా వంటలు వండాలని అన్నారు. వంటల పోటీలు నిర్వహించారు.

సమర్థవంతంగా మెనూ

సఖినేటిపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం మెనూను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా సమగ్ర శిక్షా సీఎంఓ బి.సుబ్రహ్మణ్యం సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈఓ–1 డి.కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో మండలంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. అలాగే నిర్వాహకులకు వంటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం కుక్ కమ్ హెల్పర్ ఎ.గంగప్రసాద్ ఆహార పదార్థాల తయారీ వీడియోలను చూపించారు. ముఖ్య అతిథి సీఎంఓ మాట్లాడుతూ ఈ శిక్షణ భోజన మెనూను సమర్థవంతంగా అందించడానికి దోహదపడుతుందన్నారు. సఖినేటిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి గాయత్రి మాట్లాడుతూ పిల్లలకు ఆహార పదార్థాల తయారీలో తగిన శుభ్రత పాటించాలన్నారు. భోజనం తయారీలో గ్యాస్ పొయ్యి వాడకంలో ఏమైనా ప్రమాదం సంభవించినపుడు, వాటి నివారణ చర్యలను రాజోలు ఫైర్ స్టేషన్ ఆఫీసర్ బి.బాలకృష్ణ ఆధ్వర్యంలో మరో అధికారి బి.ఉమా మహేశ్వరరావు, సిబ్బంది వివరించారు. అనంతరం వంటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

మట్టి తరలింపును అడ్డుకోండి

అంబాజీపేట: ముక్కామల వెస్ట్ కెనాల్ గట్టు మట్టిని కొంతమంది తరలించుకుపోతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల మూడేళ్లగా వరి పంటలు మునిగి నష్టపోతున్నామని అన్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడంతో అర్‌అండ్‌బీ అధికారులకు విన్నవించామని తెలిపారు. దీంతో ఆర్‌అండ్‌బీ డీఈ రాజేంద్ర గురువారం కాలువ గట్టును పరిశీలించారు. గట్టుకు పడిన గండ్లను పూడ్చేలా చర్యలు తీసుకుంటామని డీఈ హామీ ఇచ్చారని రైతులు తెలిపారు. దేవరపల్లి చిన బాలయోగి, రైతులు పాల్గొన్నారు.

కొబ్బరి రైతుల వినతి



తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం ఇస్తున్న కొబ్బరి రైతులు, నాయకులు

మలికిపురం: కరవాక నుంచి శంకరగుప్తం వరకూ మేజర్ డ్రైన్‌ను ఆనుకుని ఉన్న కొబ్బరి, సర్వే తోటలు ముంపునకు గురవుతున్నాయని మలికిపురం మండల బీజేపీ కమిటీ ఆధ్వర్యంలో రైతులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. గతంలో కలెక్టర్‌ను కలసి వినతిపత్రం ఇస్తే ఆయన రూ.ఏడు కోట్లు మంజూరు చేసి ముంపునకు గురికాకుండా ఏటుగట్టు నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చినా ఇంతవరకూ కార్యరూపం దాల్చలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఐదు రోజుల నుంచి ఉప్పుటేరు పొంగి తోటల్లోకే కాకుండా నివాస ప్రాంతాలకు ముంపు నీరు చేరి నష్టం వాటిల్లిందని అన్నారు. మండల పార్టీ బీజేపీ అధ్యక్షుడు కాఫిశెట్టి కనకేశ్వరరావు, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, అడబాల సత్యనారాయణ, మాలే శ్రీనివాస్ నగేష్, చంపాటి శివరామకృష్ణంరాజు, ఇందుకూరి అచ్యుత రామరాజు పాల్గొన్నారు.